క్లుప్తంగా

రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన



వేమూరు: నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో రూ.20 లక్షలతో నిధులతో జరగనున్న రోడ్డు మరమ్మతు పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కైతేపల్లి షాలేం రాజ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన కారుమూరులో చోటు చేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో కారుమూరు గ్రామంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో గ్రామ బస్‌షెల్టర్ సమీపంలో గ్రామానికి చెందిన సమ్మెట వెంకట్రావు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి

చందోలు(కర్లపాలెం): ఓ వ్యక్తిపై ఇరువురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన సంఘటన పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందోలు ఎస్ఐ స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఖాజీపాలెం పంచాయతీ మండేవారిపాలెంకు చెందిన బడుగు దీనారావుపై అదే గ్రామానికి చెందిన దండమూడి ఆశీర్వాదం, దోనేపాటి శోభన్‌లు గత నెల 31వ తేదీ రాత్రి దాడిచేసి గాయపరిచారని తెలిపారు. దీనారావు బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేడు వేమవరంలో గ్యార్మీ గంధ మహోత్సవం

భట్టిప్రోలు: హజరత్ మహబూబ్ సుభానీ (గరీబ్ కా గ్యార్మీ, గరీబోంక గ్యార్మీ) 13వ గ్యార్మీ, గంధ మహోత్సవం ఆదివారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో జరుగుతుందని కరామత్ షా హజరత్ మహబూబ్ సుభానీ శనివారం తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని, సాయంత్రం గంధం, జెండా ఊరేగింపు ఫకీర్ల మేళతాళాలతో ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సుభాని పేర్కొన్నారు.

పట్టణ సుందరీకరణలో భాగస్వాములు కావాలి



తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. పట్టణంలో 1,3,9 వార్డులలో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు వేజండ్ల విద్యార్థినుల ఎంపిక



చేబ్రోలు: మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ టి.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి జట్టుకు ఎంపికయ్యారు. అండర్ -14 బాలికల వాలీబాల్ జట్టుకు కె.నాగమల్లేశ్వరి, జె.నాగూర్‌బీ, వై.నందిని, వై.భవానీ ఎంపికయ్యారు. నవంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలను హెచ్ఎం టి.విజయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియా నష్రా, పీఈటీ టి.వెంకటేశ్వరరావు అభినందించారు.

పొట్ట నింపని బుట్టల అల్లిక

- నిరుపేదల భృతిపై ప్లాస్టిక్ పోటు
- రేషన్‌కార్డు సౌకర్యం అయినా కల్పించాలంటూ వేడుకోలు
- పట్టించుకోని కూటమి సర్కారు
- పస్తులతో కాలం వెళ్లదీస్తున్న గిరిజనులు



కనకాద్రినగర్‌లో రోడ్ల వెంబడి చెట్ల కింద బుట్టలు అల్లుతున్న గిరిజనులు

బాపట్లటౌన్: ఏళ్ల తరబడి బుట్టల అల్లికే ప్రధాన వృత్తిగా చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేదలు ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల వలన పూట గడవని స్థితిలో ఆకలి కేకలతో ఆలమటిస్తున్నారు. ఇలాంటి సమయంలో వాళ్లను ఆదుకోవాల్సిన పాలకులు, అధికారులు కనీసం ఆదిశగా ఆలోచించకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కడుపు నింపని కులవృత్తి..

మండలంలోని కనకాద్రినగర్‌లోని సుమారు 20 కుటుంబాలకు చెందిన గిరిజనులు గత 15 ఏళ్లుగా రోడ్లవెంబడి జీవనం సాగిస్తున్నారు. వారికి వంశపారంపర్యంగా వస్తున్న కుల వృత్తి బుట్టల అల్లిక. సూర్యలంక తీరంలోని అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి ఈత చెట్ల నుంచి ఈత సువ్వలను కోస్తారు. కోసిన ఈత సువ్వలను 15 రోజులు ఎండిన తర్వాత వాటిని ఇంటికి చేర్చుకొని బుట్టల అల్లిక ప్రారంభిస్తారు. రోజంతా ఇద్దరు కలిసి 4 బుట్టలు మాత్రమే అల్లగలరు. నాలుగు బుట్టలు మార్కెట్‌లో విక్రయిస్తే రూ. 200 నుంచి 300 వరకు వస్తాయి. వాటితోనే కుటుంబం మొత్తం పోషించుకోవాల్సి వస్తుంది. గతంలో ఏ గ్రామానికి బుట్టలు తీసుకెళ్లినా వెంటనే కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం ప్లాస్టిక్ వస్తువులు విరివిగా వాడుకలోకి రావడంతో ఈత సువ్వలతో తయారుచేసిన బుట్టలను కొనుగోలు చేసేందుకు ఏ ఒక్కరు ముందుకురావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డులు లేవు..

కనకాద్రినగర్‌లో గత 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నప్పటికీ వాళ్లకు కనీసం రేషన్‌కార్డులు లేవు. దీంతో నిరుపేదలైన వీళ్లకు ప్రభుత్వంనుంచి అందించే ఏ ఒక్క సంక్షేమ పథకాలు అందడంలేదు. కనీసం ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని అయినా అందిస్తే కొంతమేరా అయిన ఆకలి కేకలు తీరే అవకాశం ఉందని బాధితులు కోరుతున్నారు. వృద్ధులకు పెన్షన్ సౌకర్యం అయినా కల్పించమని బాధితులు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో మీకు మేము అండగా ఉంటాం.. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామంటూ హామిలిచ్చి ఓటు వేయించుకుంటున్న పాలకులు ఎన్నికల తర్వాత కనీసం తమవైపు తొంగికూడా చూడటం లేదని బాధితులు వాపోతున్నారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు లేకపోయినా ఓట్లుమాత్రం పుట్టించారని, ఓట్లు వేసేందుకు మాత్రమే మేము ఉపయోగపడుతున్నాం.. అంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి



నేను ఇదే గ్రామంలో గత 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నాను. నాకు వయస్సు 70 ఏళ్లు. ప్రభుత్వం అందించే పెన్షన్ నాకు అందడం లేదు. పెన్షన్ సౌకర్యం కల్పించమని అధికారులు, పాలకులు చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

– కామంచి మంగమ్మ, కనకాద్రినగర్

ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలి



గతంలో మేమంతా నివాసం ఉండే గృహాలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. అప్పటినుంచి చెట్లకిందనే కాలం వెళ్లదీస్తున్నాం. అధికారులు, పాలకులు స్పందించి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే గూడు ఏర్పాటు చేసుకుంటాం. రోజంతా కష్టపడినా బుట్టలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌లో ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. ఎంత కష్టపడినా పొట్టనింపుకోవడం గగనమైంది. పాలకులు స్పందించి ఆదుకోవాలి.

– కామంచి పార్వతి, కనకాద్రినగర్

6 నుంచి ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ గ్రామసభలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఎన్‌ఆర్‌ఈజీఈఎస్ పథకం కింద గ్రామ సభలు ఈ నెల 6 నుంచి 13వ తేదీవరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకట రమణ శనివారం తెలిపారు. 6న ఆళ్లమూడి, పల్లెకోన, రాచూరు, 7న ఓలేరు, గొరిగపూడి, కన్నెగంటివారిపాలెం, 8న పెదపులివర్రు, చింతమోటు, వెల్లటూరు, 12న కోనేటిపురం, సూరేపల్లి, ఐలవరం, 13న పెదలంక, పెసర్లంక, భట్టిప్రోలు గ్రామాలలో గ్రామ సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వీజీఆర్‌ఎం విద్యార్థి



బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వీజీఆర్‌ఎం కళాశాల డైరెక్టర్ అంబటి గిరిధర్ తెలిపారు. తమ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న పవన్‌కల్యాణ్ రెడ్డి అక్టోబర్ 28, 29 తేదీల్లో కడపజిల్లా, రాయచోటిలో జరిగిన అండర్-17 కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. కళాశాలలో శనివారం డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, పీడీలు ప్రత్యేకంగా అభినందించారు.

రీ సర్వేతో రైతుల భూమికి హామీ

తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు



పల్లెకోనలో రీ సర్వే గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

పల్లెకోన(భట్టిప్రోలు): భూముల రీ సర్వేలో లోపాలు సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహద పడతాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేలోని లోపాలను సవరించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి రైతు ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభలో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, మాజీ సర్పంచులు రాయన ప్రసాదరావు, మండవ రామకోటేశ్వరరావు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

12న సుందరాంజనేయ ఆలయ వార్షికోత్సవం



పడమటిపాలెంలోని సుందరాంజనేయ స్వామి వారి దేవాలయం

పడమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం నవంబర్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందరకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు విశేష పూజలు, హనుమత్ కల్యాణం, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 33 అడుగుల ఎత్తు గల ఈ విగ్రహన్ని 2008లో ప్రతిష్ఠించారు. గ్రామస్తుల కోరిక మేరకు పడమటి సుందర కుమార్ విగ్రహంతో పాటు ప్రజల సహకారంతో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఈ ఆలయ ప్రారంభం నుంచి ఈ ప్రాంతం పాడి పంటలతో సుభిక్షంగా విలసిల్లుతుందని భక్తుల నమ్మకం. మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని సుందరకుమార్ తెలిపారు.

కార్తికమాసం పద్యకుసుమం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన వేణుగోపాలరావు

తెనాలి: పట్టణానికి చెందిన కవి, రచయిత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రూపొందించిన కార్తికమాసం నిత్య పద్యకుసుమం పఠన గ్రంథాన్ని శుక్రవారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆవిష్కరించారు. దేవస్థానం పాలకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన ఈ పుస్తకాన్ని కమిటీ అధ్యక్షుడు నూకల వేంకట వేణు గోపాలరావు ఆవిష్కరించారు. అందులోని పద్యాలను గానకళారత్న వెంపటి సత్యనారాయణ గానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు, మద్దాళి శేషాచలం, పువ్వల వరదరాజులు, మాలేపాటి హరి ప్రసాద్, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, ఈఎల్‌వీ అప్పారావు, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివారావు, జి.రామకృష్ణ, ఆర్.జగదీష్‌చంద్రశర్మ పాల్గొన్నారు.

అభిషేక ప్రియునికి కార్తిక దీపారాధన పూజలు




పెదకాకాని శివాలయంలో కార్తికదీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు

- పెదకాకాని శివాలయంలో ప్రారంభమైన కార్తికమాస పూజలు
- నిత్య హోమాలు, ఏకాదశ రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు
- భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు: డీసీ లీలా కుమార్

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివాలయంలో కార్తిక మాస పూజలు భక్తి శ్రద్ధలతో శనివారం ప్రారంభమయ్యాయి. పెదకాకాని శివయ్య సన్నిధిలో కార్తిక మాసం భక్తుల సందడి ప్రారంభమైంది. తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వెంట తెచ్చుకున్న పూజా సామగ్రితో దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్తికమాసం పురస్కరించుకని ఆది, సోమవారాల్లో ఆలయానికి అధికసంఖ్యలో విచ్చేయు భక్తులకు దాతల సహకారంతో ఉదయం పాలు, మజ్జిగ, తాగు నీరు, స్వామి వారి ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులందరూ స్వామి దర్శించుకోవాలని ఆలయ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ కోరారు.



భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన రాజరాజ నరేంద్రస్వామి



భట్టిప్రోలు శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో 14వ శతాబ్దం నాటి శివ లింగం



రేపల్లెలో ప్రత్యేక పూజలందుకుంటున్న బాలాత్రిపుర సుందరి అమ్మవారు

ఆలయాలకు కార్తిక శోభ

- ప్రారంభమైన కార్తిక మాస పూజలు
- కోలాహలంగా శివాలయాలు

భట్టిప్రోలు: కార్తిక మాసం పురస్కరించుకుని శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. శివాలయాలను ఆబాలగోపాలం వేకువ జామునే అభ్యంగన స్నానమాచరించి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. కార్తిక మాసంలో సూర్య భగవానుడు తులారాశిలో ఉండగా తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో శివలింగార్చన చేయడం వల్ల సమస్త గ్రహ బాధలు తొలిగిపోయి సకల కార్యాలు, మనో వాంఛలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. శివ సన్నిధిలో ఈ మాసమంతా దీపారాధన అత్యంత శ్రేష్టమైనదని వేద బ్రాహ్మణులు తెలిపారు.

కిటకిటలాడిన దేవాలయాలు...

కార్తిక మాసం ప్రారంభం కావడంతో దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతీ సమేత విశలేశ్వరస్వామి దేవాలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఈ ఆలయంలో తెల్లవారుజామునే స్వామి వారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, పాలాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరిపారు.

పెదపులివర్రులో...

పెదపులివర్రులోని బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో తెల్లవారుజామున ఏకాదశ రుద్రాభిషేకం, నవ హారతులు కల్యాణం నిర్వహించారు. అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు.

సూరేపల్లిలో...

సూరేపల్లిలో కొలువైన కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో స్వామి వారికి భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు చేశారు.

రేపల్లెలో...

రేపల్లె రూరల్: శివకేశవులకు ప్రీతిపాత్రమైన పవిత్ర కార్తికమాసం సందర్భంగా పట్టణం, మండలంలోని పలుదేవాలయాలలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమాయ్యాయి. ఈ సందర్భంగా ఓల్డ్‌టౌన్‌లోని బాలా త్రిపుర సుందరి సమేత ఉమామహేశ్వరస్వామి ఆలయంలో, ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరుని ఆలయంలో, రైలుపేటలోని పార్వతి సమేత స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆయా దేవాలయాలలో స్వామివారిని దర్శించుకుని ఉసిరి చెట్టు, కదంబ చెట్టుల వద్ద ప్రత్యేక దీపారాధనలు చేశారు. మండలంలోని మోర్తోట కృష్ణానది తీరంలో వేంచేసియున్న పార్వతీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో, చోడాయపాలెంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత చౌడేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం కార్తిక మాసం పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రేపల్లెలో ప్రత్యేక పూజలందుకుంటున్న ఉమామహేశ్వరస్వామి



చినపరిమి రామలింగేశ్వర స్వామి ఆలయంలో అభిషేకం

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు షాహీరా



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి అండర్-19 నెట్‌బాల్ పోటీలకు తెనాలి కొత్తపేటలోని బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని షేక్ షాహీరా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబీ తెలిపారు. చిలకలూరుపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో శనివారం ఎంపిక జరిగిందని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన ఉండాలి



తెనాలిఅర్బన్: ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ పై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారి ఐబీ పద్మజ సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శనివారం స్మాల్ లెవల్ ఫెడరేషన్ రిసోర్స్‌పర్సన్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయ సంఘ సభ్యుల వివరాలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే వారి రుణాలకు సంబంధించిన వివరాలను కూడా దానిలో నమోదు చేయాలని సూచించారు. దీనికి సంఘ సభ్యులందరూ సహకరించాలని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి, సీఎంఎం జి.విజయకుమారి, సీవోలు, ఆర్పీలు, డీఈవోలు పాల్గొన్నారు.

'ఆళ్ల'కు హృదయభారతి సాహితీ సేవాపురస్కారం

తెనాలి: పట్టణానికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు, హైదరాబాద్ కు చెందిన హృదయ భారతి చారిటబుల్ ట్రస్ట్ సాహితీ సేవా పురస్కారానికి ఎంపిక య్యారు. అక్కడి బాగ్‌లింగంపల్లిలోని కళానిలయం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 8న సంస్థ వార్షికోత్సవం, స్వర్ణపుష్పం మాసపత్రిక పుష్కరోత్సవ వేడుకల్లో జరగనున్న సాహితీ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

డివైడర్‌కు ఢీకొని ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తెనాలిరూరల్: డివైడర్‌కు ఢీకొని ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి వైకుంఠపురం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వైమూరు పంచాయతిలోని బేతేలుపురంకు చెందిన చాగలమర్రి వినోద్ తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో తెనాలికి తన ఆటోలో వస్తున్నాడు. వైకుంఠపురం వద్ద నిద్రమత్తులో డివైడర్‌కు ఢీకొని ఆటో తిరగబడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం మంగళగిరి ఎన్ ఆర్ఐ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యశాల నుండి సాయంత్రం వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.